మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం సిద్దిపేటలోని ఆయ న నివాసానికి వెళ్లి శాలువా కప్పి సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
- ఎల్లారెడ్డి, జూన్ 3

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరండి

ఇంటింటి ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

రామారెడ్డి జూన్ 3: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు చేరాలని కోరుతూ అధ్యాపకులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఫస్టియర్‌లో ప్రవేశాల కోసం పలు గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. విద్యార్థుల ఇండ్లకు వెళ్లి ప్రభుత్వ కళాశాలల్లోని సౌకర్యాలు, విద్యాబోధన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుశ్రీ వాత్సవ, సిద్దయ్య, రాజు, వెంకట్ రాజు, కృష్ణవేణి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు తరలిన అధికారులు, ప్రజాప్రతినిధులు

కౌంటింగ్ కేంద్రాలకు బయల్దేరిన బాన్సువాడ ప్రజాప్రతినిధులు, ఏజెంట్లు

బాన్సువాడ/బాన్సువాడ టౌన్, జూన్ 3 : జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మంగళవారం ఎంపీ అభ్యర్థుల భవిత తేలనుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ ప్రధాన పార్టీల నేతలు వారికి వారుగా గెలుస్తామనే నమ్మకంతో ఎవరికి వారు అంచనాల్లో ఊగిసలాడుతున్నారు. సంగారెడ్డిలోని గీతం స్కూల్‌లో ఎన్నికల ఫలితాలను తేల్చేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. కౌంటింగ్ నేపథ్యంలో బాన్సువాడ నియోజకవర్గం, జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల నుంచి ఆయా శాఖ అధికారులు, పలుగురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఏజెంట్లుగా విధులు నిర్వహించడానికి జహీరాబాద్ కేంద్రానికి వెళ్లారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి తరలివెళ్లారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్

బాన్సువాడ, జూన్ 3 : పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ గంగాధర్ సూచించారు. పట్టణంలోని డెయిలీ మార్కెట్, ప్రధాన రహదారి, పాత బాన్సువాడలోని పలు కాలనీలను ఆయన సోమవారం సందర్శించారు. కాలనీలో ప్రజలతో మాట్లాడారు. చెత్తాచెదారాన్ని రోడ్ల పై, డ్రైనేజీల్లో వేయరాద ని, మున్సిపాలిటీ నుంచి వచ్చే ట్రాక్టర్‌లో వేయాలని సూచించారు. అనంతరం ఈ నెలలో ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో బాలికల పాఠశాలలో పైపులైన్‌ను పరిశీలించారు. తాగునీటి ఎద్దడి నివారణకు కృషి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఆయన వెంట వ్యాపా రవేత్త బెజుగాం భాస్కర్ గుప్తా తదితరులు ఉన్నారు.

పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

కామారెడ్డి, జూన్ 3 : జిల్లా వ్యాప్తంగా పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయని డీఈవో రాజు తెలిపారు. మొదటి రోజు తెలుగు పేపర్ పరీక్ష నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కామారెడ్డి, బాన్సువాడలో రెండు సెంటర్లలో 268 మంది విద్యార్థులకుగాను 233 మంది హాజరయ్యారని 35 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED TEACHERS
★Wanted Teachers to teach English, Maths, Physics, Biology and Social Note: Wanted Lady Accountant Little Hearts High School, Namdevwada, Nizamabad. Cont: 9948712344, 9666020695
NTZ-324927

WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327729-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
" పేరు మార్పిడి " ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గాలీవాన బీభత్సం

- ఎగిరిపడిన ట్రాన్స్‌ఫార్మర్లు.. విరిగిన స్తంభాలు
- రాత్రివేళ అంధకారంలో పల్లెలు
- ట్రాన్స్‌కోకు రూ.6 లక్షల నష్టం

నాగిరెడ్డిపేట శివారులో కూలిన చెట్టు

నాగిరెడ్డిపేట, జూన్ 3: మండలంలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. నాగిరెడ్డిపేట, బంజారా గోపాల్‌పేట, చీనూర్, వాడి, గోలి లింగాల గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. బలమైన ఈదురు గాలులకు నాగిరెడ్డిపేట, బంజరా శివారులోని వ్యవసాయ బోరుబావుల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు గద్దెపై నుంచి కిందపడ్డాయి. విద్యుత్తు స్తంభాలు విరిగి నేలకొరిగాయి. మరికొన్ని చోట్ల చెట్లు పడడంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. బంజారా సబ్‌స్టేషన్‌లో డిస్కులు పగిలిపోయాయి. రాత్రి విద్యుత్ సరఫరా లేకపోవడంతో మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. ఏఈ మనోరంజన్‌రెడ్డి, విద్యుత్ సిబ్బందితో కలిసి రాత్రి నుంచి మరమ్మతులు చేపట్టారు. సోమవారం ట్రాన్స్‌కో ఏడీ సుదర్శన్, ఏఈ మనోరంజన్‌రెడ్డితో కలిసి పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సబ్‌స్టేషన్‌లో విలువైన డిస్కులు పగిలిపోయినట్లు చెప్పారు. నాగిరెడ్డిపేట, బంజారా శివారులో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, 11కేవీ స్తంభాలు 14 విరిగి పడినట్లు చెప్పారు. దీంతో ట్రాన్స్‌కోకు రూ.6 లక్షల నష్టం వాటిల్లినట్లు వారు తెలిపారు. భారీ వర్షంతో మండలంలోని పడావు భూములు జలకళను సంతరించుకున్నాయి. బీడు భూములు, చిన్నచిన్న కుంటలు పూర్తిగా నీటితో నిండాయి. ఆదివారం వరకు తీవ్ర వేడి, ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలు.. సోమవారం చల్లని వాతావరణంతో ఉపశమనం పొందారు.

వర్షం నీటితో బంజర తండా పరిసరాలు

విరిగి పడిన స్తంభాలు

విరిగి పడిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఏడీ సుదర్శన్

కూలిపోయిన గుడిసె

వ్యవసాయ భూముల్లో నిలిచిన నీరు

లక్ష్యాలను పూర్తిచేయాలి

జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి, జూన్ 3 : వానకాలం 2022-23 సీజన్‌కు సంబంధించి లక్ష్యాలను పూర్తి చేయని, డిఫాల్టర్ రైస్ మిల్లుల యజమానులు ఈ నెల 26లోగా పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లక్ష్యాలు పూర్తి చేయని 35 మంది రైస్ మిల్ యజమానులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ నెల 26లోగా లక్ష్యం పూర్తి చేయని రైస్‌మిల్ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిల్లర్లపై ఆర్ఆర్ చట్టం కింద క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున బాబు, ఇన్‌చార్జి జిల్లా పౌర సరఫరాల మేనేజర్ నిత్యానందం, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్లు కిష్టయ్య, శ్రీనివాస్, రైస్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

ఇప్పటి వరకు 769 మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించాం

కామారెడ్డి జిల్లాలో సోమవారం 32 లారీలు సమకూర్చి కొనుగోలు కేంద్రాల ద్వారా 769 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించామని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. ప్రస్తుత యాసంగి కొనుగోళ్లకు సంబంధించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు గత మార్చి 26న ప్రాథమిక సహకార సంఘాల ద్వారా 327, ఐకేపీ ద్వారా 23 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 344 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి అయ్యాయని, మరో ఆరు కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రక్రియ సాగుతున్నదని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 54,715 మంది రైతుల నుంచి 693 కోట్ల రూపాయల విలువైన 3,14,737 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. 659 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమచేశామని తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో మిగతా ఆరు కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి చేస్తామని తెలిపారు.

ప్రైవేట్ స్కూల్స్‌లో పాఠ్యపుస్తకాల విక్రయాలను అడ్డుకున్న ఏబీవీపీ

ఎల్లారెడ్డి, జూన్ 3 : ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలను విక్రయించడం నేరమని ఏబీవీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని జీవదాన్ పాఠశాలలో పాఠ్య పుస్తకాల విక్రయాలను సోమవారం అడ్డుకొన్నారు. ఈ సందర్భంగా యాజమాన్యంతో మాట్లాడుతూ.. విద్యా సంస్థల్లో పాఠ్య పుస్తకాలను విక్రయించరాదని సూచించారు. అనంతరం పాఠ్య పుస్తకాల విక్రయంపై విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు.

దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జెండా ఆవిష్కరణ

కోటగిరి, జూన్ 3 : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా కోటగిరి మండలకేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను స్థానిక గ్రామ పార్టీ అధ్యక్షుడు అనిల్ కులకర్ణి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో విండో చైర్మన్ కూచి సిద్ధు, సైలంపూర్ హౌగిరావుపటేల్, సాయిలు, సాయిబాబా, విష్ణు, ఆకుల పోశెట్టి, గంగాప్రసాద్‌గౌడ్, వడ్ల విజయ్, హెచ్.విజయ్, మారుతి, లాలయ్య పాల్గొన్నారు.

కోటగిరిలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న గ్రామశాఖ అధ్యక్షుడు అనిల్

ప్రతి గ్రామంలో కల్లాలు ఏర్పాటు చేస్తాం

ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి రూరల్, జూన్ 3 : ప్రతి గ్రామంలో కల్లాలను ఏర్పాటు చేస్తామని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. కామారెడ్డి మండలంలోని ఇస్రోజివాడి, గర్గుల్, శాబ్దిపూర్ గ్రామాల రైతులతో ఎమ్మెల్యే సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి గ్రామంలో కల్లాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాబ్దిపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

నాణ్యమైన దుస్తులు అందించాలి

చీనూర్ మహిళా శక్తి కుట్టు మిషన్ కేంద్రం సభ్యులతో ఐకేపీ ఏపీఎం

నాగిరెడ్డిపేట, జూన్ 3 : నాణ్యమైన ఏకరూప దుస్తులు సకాలంలో అందించాలని ఐకేపీ ఏపీఎం జగదీశ్ అన్నారు. మండలంలోని చీనూర్, గోపాల్‌పేట, గోలిలింగాల గ్రామాల్లోని మహిళా శక్తి కుట్టు మిషన్ కేంద్రాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఏకరూప దుస్తుల కుట్టు పనులను పరిశీలించి, ఇచ్చిన కొలతల ప్రకారం చేపట్టాలన్నారు. నాణ్యతతో పనులు పూర్తి చేసి జిల్లా స్థాయిలో గుర్తింపు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గోపాల్‌పేట, చీనూర్, గోలిలింగాల, తాండూర్, జలాల్‌పూర్, జప్తిజాన్కంపల్లి, రాఘవపల్లి గ్రామాల్లో మహిళా శక్తి కుట్టు మిషన్ సంఘాలకు ఏక రూప దుస్తుల కుట్టు పనులను అప్పజెప్పినట్లు తెలిపారు. ఈనెల 10 వరకు సిద్ధం చేయాలని సూచించారు. ఏపీఎం వెం ట ఐకేపీ సీసీ రమేశ్, సిబ్బంది ఉన్నారు.

బద్రినాథ్‌కు చేరిన పాదయాత్ర

- 1900 కిలోమీటర్ల మేర కాలినడకన
- 70వ రోజు దర్శనం చేసుకున్న భక్తులు

బద్రినాథ్ ఆలయం వద్ద కౌల్‌పూర్ భక్తులు

నందిపేట్, జూన్ 3: మండల కేంద్రంలోని కౌల్‌పూర్ గ్రామానికి చెందిన పరమహంస భూమా యోగేశ్వర ఆశ్రమం నుంచి ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని బద్రినాథ్ ఆలయం వరకు పాదయాత్ర చేపట్టిన భక్తులు 70వ రోజు సోమవారం ఆలయానికి చేరుకున్నారు. 1900 కిలోమీటర్ల మేరకు కాలినడకన వెళ్లి బద్రినాథ్ చేరుకున్న భక్తులు ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మార్చి 24న ఆశ్రమ నుంచి ఆశ్రమ వ్యవస్థాపకుడు చింత రమేశ్ ఆధ్వర్యంలో భక్తులు పాదయాత్ర చేపట్టారు. భక్తులు 1900 కిలోమీటర్ల మేర నడిచారని, భక్తులందరూ ఆరోగ్యంగా ఉన్నారని ఆశ్రమ వ్యవస్థాపకుడు తెలిపారు.

హోంగార్డుపై చాకుతో దాడి..

నవీపేట, జూన్ 3: సరదాగా తీసుకున్న ఫోన్‌ను తిరిగి ఇవ్వాలని కోరినందుకు కక్ష పెంచుకున్న ఓ రౌడీషీటర్ తన బావతో కలిసి హోంగార్డుపై దాడి చేసి గాయ పర్చిన ఘటనలో రౌడీషీటర్ షేక్ సలీంను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. నవీపేటకు చెందిన సాయికుమార్ నిజామాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రౌడీషీటర్ షేక్ సలీం నెల క్రితం సాయికుమార్ ఫోన్ తీసుకున్నాడు. ఫోన్ ఇవ్వాలని ఈనెల ఒకటిన సాయికుమార్ కోరాడు. దీంతో అదే గ్రామానికి చెందిన తన బావ రహీంతో కలిసి రౌడీషీటర్ షేక్ సలీం చాకుతో హోంగార్డు సాయికుమార్‌పై దాడిచేశారు. దీంతో సాయికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రౌడీ షీటర్‌ను పట్టుకుని సోమవారం రిమాండ్‌కు తరలించారు. రహీం పరారీలో ఉన్నాడని, గాలింపు చర్యలు చేపడుతున్నామని ఎస్సై తెలిపారు.

నిర్మాణ పనుల పరిశీలన

నర్సరీని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు

బాన్సువాడ టౌన్, జూన్ 3 : బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు సిబ్బందితో కలిసి పట్టణంలో సోమవారం పర్యటించారు. పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ యార్డు, మల్టీజనరేషన్, చిల్డ్రెన్ పార్కులు, నర్సరీలను పరిశీలించారు. నిర్మాణ పనులు, పార్కులు, నర్సరీల నిర్వహణ గురించి సూపర్‌వైజర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట సూపర్‌వైజర్ సతీశ్, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ

పెద్దకొడప్‌గల్‌లో జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

పెద్దకొడప్‌గల్, జూన్ 3: మండల కేంద్రంలోని సహకార సంఘ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలను ఏఈవో మాధవి, కార్యదర్శి సందీప్ కుమార్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాపాస్‌బుక్, ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీలను తీసుకొని రావాలని సూచించారు. 30కిలోల జీలుగ విత్తనాల బస్తా సబ్సిడీపై రూ.1,116, జనుము 40కిలోల బస్తా సబ్సిడీపై 1,448 రూపాయలకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గండి మాసానిపేట్ సొసైటీలో జనుము విత్తనాలు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 3: మున్సిపల్ పరిధిలోని గండిమాసానిపేట్ సొసైటీలో జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ విస్తీర్ణాధికారి ముఖీద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40కిలోల జనుము విత్తనాల బస్తాను 1448 రూపాయలకు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కావాల్సిన రైతులు పట్టాపాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను తీసుకువచ్చి విత్తనాలను తీసుకోవాలని ఆయన సూచించారు.